# జ్ఞాపిక

సంగిరెడ్డి త్రివిక్రమరావు


జీవితాలలో స్థిరపడి నడివయసు దాటినాక-ఒకసారి బాల్యంలో చదువుకొన్న పాఠాలను సందర్శిస్తే, అదొక తియ్యని అనుభూతిని కలిగిస్తుంది ఎవరికైనా. చాలా స్కూళ్లకు మల్లే నేను చదువుకొన్న హై స్కూలు 'పూర్వవిద్యార్థుల సమావేశా'నికి రమ్మని నిన్ననే ఆహ్వానం రావటంతో, పనులు తెముల్చుకొని బయలుదేరాను. నేను మరో స్కూల్లో టీచరుగా ఉంటున్నా, ప్రతి ఏడాదీ ఈ సమావేశానికి తప్పక హాజరవుతుంటాను. ప్రతీ సంవత్సరమూ టీచర్స్ డే రోజు అన్ని చోట్లకు మల్లే ఊళ్లో పేరున్న స్కూళ్లలో, ఒకప్పుడు చదువుకొన్న విద్యార్థుల సమావేశం కావటం, తమ విద్యార్థి దశను గుర్తు చేసుకోవటమూ ఒక ఆనవాయితీ. ఈ సమావేశానికి వెళ్లడం అంత ముఖ్యం కానప్పటికీ, ఊళ్లోనే ఉండి అందుబాటూ, అవకాశం ఉన్న ఓల్డ్ స్టూడెంట్స్ అందరూ తప్పని సరిగా అటెండ్ అవుతూంటారు. వీళ్లలో పెద్దవారూ, ఉద్యోగాలు చేసేవారే ఎక్కువగా ఉంటారు. వీళ్లంతా ఆ రోజునొక పండుగగా భావిస్తూంటారు.

క్రితం ఏడాది సమావేశంలో, ఇదే స్కూలు విద్యార్థి, నగరంలోని అతి పెద్ద పారిశ్రామికసంస్థలో అత్యున్నతోద్యోగి అయిన ఒక యువకుడు-గ్రూ ప్ ఫోటో తీసేటప్పుడు, పెద్ద వారంతా నిలబడితే, వేదిక చాలకపోవడంతో, క్రింద మెట్లపై కూర్చున్నవారి వరుసలో చివరగా సర్దుకు కూర్చున్నాడు. క్రింద కూర్చొనవద్దని ఎంత మంది చెప్పినా, 'మరేమీ పరవాలే'దంటూ, ఒకమామూలు విద్యార్థిలా స్కూలు పట్లా, పెద్దల పట్లా తన విధేయతను చూపించాడు. ఈ సమావేశంలో సౌహార్దమైన ఇటువంటి సన్నివేశాలు ఎన్నో కానవస్తూంటాయి.

సమావేశపు కమిటీ సభ్యులందరూ, ఏడాది కోసారి కలుసుకోవడమే కాక, మధ్యకాలంలో అప్పుడప్పుడూ కలుస్తూండటం, నిరుద్యోగులుగా ఉన్న పూర్వవిద్యార్థులకు ఏదైనా దారి చూపించడం, స్కూలును బాగు చేయిం చడానికి చర్యలు చేపట్టడం, బాగా చదువుకొనే విద్యార్థులకు పై చదువులకు ఆర్థికసహాయం చేయడం వంటి సామాజికసేవాకార్యక్రమాలు చేపడూంటారు. ఇదంతా 'మన స్కూలు' అన్న అభిమానం వల్లనే.

ఎప్పటి మల్లే క్వాడ్రాంగిల్ హాల్లో సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేను వెళ్లేసరికి, అప్పటికే వచ్చి ఉన్న పాత మిత్రులంతా ఎదురయ్యారు. అందరికీ విష్ చేశాక, క్వాడ్రాంగిల్ హాల్లో బల్లలు సర్దడంలో కాస్త పాల్గొన్నాను. వేదికకు వెనుక బేగ్రౌండ్ వాల్‌కు, 'సి.బి.ఎం. హై స్కూలు పూర్వవిద్యార్థుల సమావేశం' అన్న పెద్ద అక్షరాలతో బేనర్ కట్టబడి ఉంది. క్రమంగా సభ్యులంతా హాజరవడం, ఆప్యాయంగా కుశల ప్రశ్న లు వేసుకోవడమూ జరుగుతున్నది. ఎప్పటిలాగానే సమావేశానికి పూర్వవిద్యార్థులతో పాటు, స్కూల్లో ప్రస్తుతసంవత్సరంలో చదువుతూన్న పదవ తరగతి విద్యార్థులూ, పని చేస్తూ ఉన్న ఉపాధ్యాయులూ, ప్రధానోపాధ్యా యుల వరకూ హాజరయినారు.

కొద్ది సేపట్లో సమావేశం ప్రారంభం అయ్యిం ది. అధ్య క్షుల ఎా ం ం న వూ వే శ



ఉద్దేశాన్నీ, సంవత్సరాల చరిత్ర గల స్కూలు అభివృద్ధికి కమిటీ చెయ్యాల్సిన కృషినీ వివరించారు. ముఖ్యంగా స్కూల్లో క్వాడ్రాంగిల్ హాల్ గోడలు పాతబారిపోవడంతో, వాటి పని ఈ ఏడాది జరగాలని, స్కూలు యాజమాన్యం పూనుకొంటే, కమిటీ పూర్తిగా సహకరిస్తుందని నిర్ణయం తీసుకొన్నారు. తరువాత ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒక ప్రముఖుడూ, మరి కొందరు పెద్దలూ ప్రసంగిస్తూ, స్కూలు అభివృద్ధికి తమ వంతు సహకారం అందించగలమని హామీ నిచ్చారు.


తరువాత స్కూలు పూర్వవిద్యార్థి అయిన ఒక తలపండిన వృద్ధుణ్ని వేదిక పైకి ఆహ్వానించి సత్కరించారు. కార్యదర్శి గారు ఆయన్ని పరిచయం చేస్తూ "ఆదినారాయణగారు, ఈ వయసులో కూడా ప్రతీ సంవత్సరం మిస్సవకుండా సమావేశానికి అటెండ్ అవుతూంటారు. ఈయనకు స్కూలుపై ఎంత అభిమానమంటే ప్రతి సంవత్సరం మన పూర్వవిద్యార్థులందరికీ, వాళ్ల వయసులో తన కన్నా బాగా చిన్నవారైనా సరే, అందరికీ నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్స్ పంపిస్తూ ఉంటారు" అంటూ ఆయన్ని మాట్లాడాల్సిందిగా కోరారు. ఆయన తన విద్యార్థిదశలోని అనుభవాలనూ, ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల వాత్సల్యం, విద్యార్థులకు గురువుల పట్ల ఉండే గౌరవ భావాన్ని ఎంతో ఆసక్తికరంగా వివరించారు. ఒక్కో సంవత్సరం వయసు మీద పడుతున్నా, మన 'ఓల్డ్ స్టూడెంట్స్ మీటింగ్' అనే సరికల్లా ఒక బాలునిలా మళ్లీ స్కూలుకు వస్తూన్న విద్యార్థిలా తనలో ఏదో తెలియని మధురానుభూతి కలుగుతుందని, ఆ రోజుల్లోని తియ్యందనపు జ్ఞాపకాలను ఒకింత సేపు ఆస్వాదించ డానికే తాను ఈ ఈ సమావేశానికి వస్తూంటానని అన్నారా, య న, తన ప్రసంగాన్ని ముగిస్తూ.

తరువాత కార్యక్రమాలు వరుసగా సాగిపోయాయి. కొద్ది నెలల్లో రిటైర్ కాబోతున్న ఇద్దరు ఉపాధ్యాయులకు సత్కారం జరిగింది. స్కూలు పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకొన్న ఒక విద్యార్థికి గోల్డ్ మెడల్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సంవత్సరం నుండి స్కూల్లో, ఐదు వందలు దాటి మార్కులు సంపాదించిన ప్రతి విద్యార్థికీ గోల్డ్ మెడల్స్ ఇవ్వనున్నామని కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు, కార్యదర్శిగారు.

ఆయన పిలువడంతో ఒక పూర్వ విద్యార్థిని స్టేజ్ పైకి వచ్చి మైకు ముందు మాట్లాడింది. తాను టెన్త్ క్లాస్ ఈ స్కూల్లోనే చదివి ఫస్టు క్లాసులో పాసయినానని, ఇంటర్‌లోనూ మంచి మార్కులు వచ్చాయని, తనకు డిగ్రీ చదవాలన్నా కోరిక ఉన్నా, ఆర్థికస్థితిలోపం వల్ల చదువు ఆపేయాల్సి వచ్చిందని, ఇంట్లోవాళ్లు తనకు పెళ్లి సంబంధం కూడా కుదిర్చారని చెబుతూ, చదువుకోవాలన్న ఆశ తీరనందుకు తన బాధను వ్యక్తం చేసింది, ఆ అమ్మాయి. దానికి కమిటీవారు స్పందిస్తూ ఒకవేళ ఆమెకు వివాహమే జరిగితే, ఆమె భర్త అంగీకరిస్తే, ఆమె చదువుకు కావాల్సిన ఆర్థికసహాయం కమిటీ అందిస్తుందని హామీనిచ్చారు.

తరువాత, స్కూల్లో ప్రస్తుతం పని చేస్తూన్న ప్రధానోపాధ్యాయుల వారికీ, మిగతా టీచర్లకూ ముఖ్యఅతిథి చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. తమ తమ అభిమాన ఉపాధ్యాయులూ, క్లాసు టీచర్లూ వేదిక వద్దకు గబగబా వస్తూ ఉంటే, హాలంతా మారు మ్రోగేలా చప్పట్లు కొట్టారు విద్యార్థులు. అందరికీ స్వీట్ల పంపకం అయినాక కార్యదర్శి ఇలా అన్నారు. "మెమెంటో... అనగా, జ్ఞాపకం చేసే గుర్తు 'జ్ఞాపికం.' ఇప్పుడు మనం మన

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**సాధారణప్రచురణకు స్వీకరించిన కథ**



సమావేశానికి గుర్తుగా చిరకాలం జ్ఞాపకం ఉండేందుకు, మన స్కూల్‌కు సేవలందించిన వారందరికీ జ్ఞాపికలు అందించాము. అసలు, నూట అరవై సంవత్సరాల చరిత్ర కలిగిన మన ఈ స్కూలు, ఇక్కడ విద్య నభ్యసించిన వాళ్లందరికీ, ఈ నగరానికీ ఒక ప్రాచీనజ్ఞాపిక. ఎన్నో వేల మందికి విద్యా దానం చేసిన మన స్కూలు, స్కూలు ప్రాంగణంలోని ఈ క్వాడ్రాంగిల్ హాలు అటు వైపున్న ఆఫీసు హాలు, హెచ్.ఎం. గారి ప్రైవేటు రూం, మన ప్లే గ్రౌండ్, తలలు పండిన ఈ పూర్వవిద్యార్థులూ-ఇవన్నీ మన స్కూలు జీవితానికి జ్ఞాపికలే... ఈ నాటి ఈ సమావేశమే మన కొక తియ్యని జ్ఞాపిక! ఇప్పుడు మరొక్కరిని, ఈ సారి కూడా సత్కరించుకొందాం-" అంటూ కార్యదర్శిగారు, దూరంగా ఉన్న కార్యకర్తలకు సైగ చేశారు. విద్యార్థులంతా ఆసక్తిగా అటు చూశారు.

కార్యకర్తలు, ఒక ముసలమ్మను మెల్లగా నడిపిస్తూ వేదిక పైకి తీసుకువస్తున్నారు. వంగి మెల్లగా అడుగులేస్తూ వస్తూన్న తొంభైయేళ్ల ఆ నిరక్షరకుక్షిని చూసి, పిల్లలంతా "ఈ మామ్మా?" అన్నట్టు నివ్వెరపోయి, తరువాత చప్పట్లు కొట్టసాగారు.

ఈ ముసలామెతో పాటు వచ్చిన మరో ఇద్దరు, ఆమె వయసువారే, వేదికకు దూరంగా ఆగిపోయారు. మెల్లగా ఆ ముసలామె వేదికను చేరుకొన్నాక, ముఖ్య అతిథి కొన్ని పండ్లు, ఒక చీరనూ ఆమె చేతిలో ఉంచి సత్కరించారు.

తరువాత కార్యదర్శిగారు ఇలా అన్నారు-"ఈమె, ఈ సీతమ్మ మన స్కూలు గేటు వద్ద మీ పిల్లలందరికీ చిరుతిళ్లు అమ్ముతూ ఉంటుందని మీ అందరికీ తెలుసు. లెక్క లేనంతమంది విద్యార్థినీ విద్యార్థులు ఈ స్కూల్లో చదువుకొన్నవారూ, ఇంతకు ముందు గానీ, ఇప్పుడు గానీ, పని చేసిన, పని చేస్తున్న టీచర్లూ, ఇంకా ఎందరో ఈ స్కూలు వదిలి వెళ్లిపోయినవారే. కాని ఈమె గత యాభై ఏళ్లుగా ఇక్కడే, ఈ స్కూలు గేటు వద్దే చిరుతిళ్లు

అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నది. ఈమె చూస్తూండగానే ఎందరో ప్రధానోపాధ్యాయులు, ఇంకెందరో ఉపాధ్యాయులూ రిటైరైనారు. ఈ ఏభై ఏళ్లుగా ఈమె స్కూలు పిల్లల్ని, అంటే స్కూలును మాత్రమే నమ్ముకొని జీవిస్తున్నది. మనమంతా ఈ స్కూలు వదిలేసినా ఈమె మాత్రం విడిచిపెట్టలేదు. ప్లే గ్రౌండ్, తరగతి గదులూ, స్కూల్లో చెట్లూ, అవీ, ఎలాగో... స్కూలు గేటు వద్ద ఈ ముసలమ్మ కూడా స్కూల్లోని ఒక భాగమైపోయింది. ఈమెకు ఈ స్కూల్లోని ఇల్లు, కుటుంబం, జీవితం, దైవం కూడా. చిరకాలంగా మన స్కూలును నమ్ముకొన్నందుకు, రాచరికాలు పూర్వవైభవాన్ని చాటిచెప్పే శిలా శిల్పంలా, మన స్కూలు ప్రాచీనతకు ఈమె కూడా-ఒక గుర్తుగా, ఒక సజీవజ్ఞాపికగా మిగిలి ఉన్నందుకు ఈమెను సన్మానించుకొంటున్నాం" అంటూ ఆయన ప్రసంగం ముగించగానే అందరూ చప్పట్లతో ఆమెను అభినందించారు.

ఈరెల్లి ముసలమ్మను ప్రతి ఏడాదీ కమిటీ ఇలా సన్మానిస్తుంది. స్కూలు గేటు వద్ద ఈమె చిరుతిళ్లు అమ్ముతూండగా కొనుక్కుతిన్న వారిలో నేనూ ఒకణ్ని. ప్రభుత్వపాఠశాలల్లో చదివే పేద-మధ్య తరగతి పిల్లలు కొనుక్కొనే చిరుతిళ్లు-బిళ్లలూ, ఊరవేసిన మామిడి ముక్కలు, ఉసిరికాయల వంటివి అమ్ముతూ జీవిస్తున్నది ఇన్నేళ్లుగా. రోడ్డు పైన దుమ్ము, ధూళీ వాటిపై పడతాయని పెద్ద వాళ్లు చెప్పినా పిల్లలు పట్టించుకోరు. ముఖ్యంగా చిన్న తరగతుల పిల్లకాయలే ఈమె వద్ద కొనుక్కొని తింటూంటారు. ఈ పిల్ల కస్టమర్లే మన పాత కాలం వ్యాపారికి ఉదర పోషకులు. ఈ స్కూల్లో చదివి ఈ నాడు పెద్దవారైన వారెందరో, ఈమె వద్ద బిళ్లలూ, మామిడిముక్కలూ కొనుక్కొని చప్పరించినవారే. ఆ కాలంలో ఆవిడతో పాటు చిరుతిళ్లు అమ్మే మిగతా వ్యాపారస్తులు ఇప్పుడు ఎవరూ లేరక్కడ. ఇప్పుడుంటున్నవాళ్లంతా కొత్త ముఖాలే. ఈ ముసల్ది మాత్రం గేటు వద్దే చిన్న తాటాకు గొడుగు నీడలో ఇన్నేళ్లుగా జీవనం సాగిస్తూన్నది. ఈమెకు కుటుంబం, పిల్లా, పీచూ, ఎవరూ లేరు... ఏకాకి... రాత్రులు ఎవరో తెలిసినవారి ఇంటికి వెళ్లి ఓ పంచన పడుకొంటుంది. తన గంజేదో తనే కాచుకొంటుందట. తన దుకాణం సామానులు బుట్టా, గొడుగూ, అన్నీ, సాయంకాలం స్కూలు వదిలేశాక, స్కూలు ఆవరణలోనే ఓ మూల దాచుకొని ఇంటికి పోతుంది. రోజూ ఉదయాన్నే రావటం, సాయంత్రం పొద్దుపోయాక పోవడం, మధ్యలో తన వ్యాపారం. ఇదే జీవితం. ఈమె ఈ స్కూల్లో చదువుకోలేదు. ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. నిజానికి ఈమెకు స్కూలుతో ఎలాంటి సంబంధమూ లేదు. కాని ఆమె జీవనవృత్తి ఆమెకు స్కూలు పిల్లలతో, స్కూలుతో విడదీయ రాని బంధాన్ని ఏర్పాటు చేసింది. ఆమెను జీవితాంతం పోషించింది. ఆమెను వారిలో ఒకరుగా చేసింది.

రిటైరయి, ఎప్పుడో స్కూలు వదిలేసిన ఉపాధ్యాయులు సహితం, ఏదైనా, పని మీద స్కూలుకు రావటం తటస్థిస్తే, పోతూపోతూ మామ్మను ఒకసారి పలకరించి పోకుండా ఉండరు.

చదువుకొన్నవాళ్లంతా తనను గౌరవించడం పట్ల, ఆమెకు అవగాహన లేక పోవచ్చు. కానీ ప్రతీ ఏడాదీ ఇలా వీళ్లంతా అభిమానంగా తనను పిలిచి, చీర పెట్టడం గురించి తన పరిచితులకు చెప్పి అందరికీ చూపెడుతుంది సీతమ్మ.

కార్యదర్శిగారు ఆమెను కుశలప్రశ్నలడిగాక, "పిల్లలకు ఏమైనా రెండు మాటలు చెప్పు, మన స్కూలు గురించి" అన్నారు నవ్వుతూ.

వార్ధక్యంలో తలే కాదు, మాట కూడా వణుకుతూండగా మెల్లగా ఆమె అంది-"మంచి స్కూలు బాబూ... ఎందరో పెద్దోళ్లు సదువుకొన్నారు.... ఈ బళ్లో పిల్లలే... నాకు అన్నం పెడుతున్నారు... ఇయ్యాల్టికీ..."

... పిల్లలతో పాటు పెద్దలూ కరతాళధ్వనులు చేశారు ఆమె మాటలకు.

సీతమ్మ చిరుతిళ్లు అమ్ముకొనేదే కావచ్చు. కాని ఆమెకు పిల్లలంటే ఎంతో అభిమానం. ఆమె అంటే పిల్లలకూ అభిమానం. ఆమె లాంటివారి తోడి వ్యాపారవ్యవహారాలు అభిమానపూర్వకంగా ఉంటాయి. అయితే మన జీవితావసరాలు ఇలాంటివాటిని వ్యాపారదృక్పథంతోనే చూస్తాయి. కాని ప్రతి విషయంలోనూ, కాస్త చూస్తే-మనకు తెలియని జీవనబంధమేదో మనల్ని అందరినీ కలుపుతూ స్నేహహస్తాలను చాస్తూ ఉన్నదని మనం గుర్తించగలం. ఆ బంధమే చిరువ్యాపారి సీతమ్మను స్కూల్లో ఒక పాత్రను చేసింది. విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, పెద్దవాళ్లు-ఇలా ఈ విద్యావంతులందరి సరసనా సీతమ్మకు ఆదరాభిమానాలు!

సీతమ్మ చిరుతిళ్లు అమ్ముకొనేదే కావచ్చు. కాని ఆమెకు పిల్లలంటే ఎంతో అభిమానం. ఆమె అంటే పిల్లలకూ అభిమానం. ఆమె లాంటివారి తోడి వ్యాపార వ్యవహారాలు అభిమాన పూర్వకం గా ఉంటాయి. అయితే మన జీవితావసరాలు ఇలాంటివాటిని వ్యాపారదృక్పథంతోనే చూస్తాయి. కాని ప్రతి విషయంలోనూ, కాస్త చూస్తే-మనకు తెలియని జీవనబంధమేదో మనల్ని అందరినీ కలుపుతూ స్నేహహస్తాలను చాస్తూ ఉన్నదని మనం గుర్తించగలం. ఆ బంధమే చిరువ్యాపారి సీతమ్మను స్కూల్లో ఒక పాత్రను చేసింది.

కార్యదర్శిగారన్నట్లు ఈ సమావేశం ఒక జ్ఞాపికే! మరచి పోయిన బాల్యాన్ని, చదువుకొన్న ఆ రోజుల్లో తమని బళ్లో దింపి వచ్చే తాతయ్య-నాయనమ్మల ప్రేమాభిమానాలు-స్నేహానికీ, తమ నింత వారిని చేసిన పెద్దలకూ, సీతమ్మ వంటి చిరుపాత్రలకూ తాము ఋణపడి ఉన్నామని గుర్తు చేసే, ఇలాంటి సమావేశాలూ, కలయికలే నిజమైన జ్ఞాపికలు!

కార్యకర్తలు సీతమ్మను జాగ్రత్తగా వేదిక నుండి దిగవిడిచాక, ఆమె తనకు తోడుగా వచ్చిన తన స్నేహితురాళ్లతో మెల్లగా నడుస్తూ, బయటికి వెళ్లిపోయింది.

ఒకటి-రెండు చిన్న కార్యక్రమాలయినాక సమావేశం ముగించబడింది. మిత్రులంతా వీడ్కోళ్లు తీసుకొంటూ ఎవరి దారి వాళ్లు పట్టారు.

సెలవు దినం కావటం వల్ల, స్కూలు లోపలే కాక స్కూలు బయట కూడా ప్రశాంతంగా ఉంది.

బయటకు వస్తూ, అటు చూశాను. ఆమె తన గొడుగు కింద ఎప్పటిగానే ఆసీనురాలై ఉంది. ప్రశాంతంగా ఉన్న సాయంకాలపు ఆకాశం, పాత కట్టడాలతో సువిశాలమైన స్కూలు ఆవరణం... లోపల ఎత్తుగా గుబురుగా ఉన్న పచ్చని చెట్లు, దూరంగా పెద్ద తరగతుల మేడపైన శిఖరంలా కనిపించే స్కూలు గంట... ఇక్కడ... స్కూలు పాదాల వద్ద ఏళ్ల తరబడి తదేక ధ్యానంలో, దానికి అంకితమైన తాపసిలా ఆవృద్ధురాలు!

...ఆ సజీవజ్ఞాపికను మనసారా ఒకసారి చూసి, ముందుకు కదిలాను.